## చిట్టిగెడ్డపై చెక్‌డ్యామ్‌కి నిధులు మంజూరు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని తాళ్లబురిడి గ్రామపరిధిలోని సాగిగెడ్డకు అనుసరించి ఉన్న చిట్టిగెడ్డపై చెక్‌డాం నిర్మించాలని కోరుతూ ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి వినతి అందించగా. ఆయన అధికారులతో మాట్లాడి రూ.40 లక్షలతో చెక్‌డాం నిర్మించడానికి అధికారులు నిధులు మంజూరు చేసినట్లు ఆదివారం కొప్పల వెలమ సంక్షేమ సంఘం డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడుతో గ్రామస్తులు తెలియజేశారు. ఈ చెక్‌డాం నిర్మాణం వల్ల సుమారు 200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందుతుందని తెలిపారు. స్పందించి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

**గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇలాకాలో జ్యూట్ కార్మికుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మూడేళ్లుగా మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్లు తెరుచుకోకపోవడంతో కార్మికుల కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. మన్యం జిల్లాలో గల ఏకైక పరిశ్రమ మూతపడి ఉండడంతో కార్మికుల కుటుంబాలు ఉపాధి కోసం వలస బాట పట్టాయి. ఎక్కడ పని దొరికితే అక్కడకి వెళ్లిపోతున్నారు. రాజాం, చిన్నాపురం, నెల్లిమర్ల, ఏలూరు ప్రాంతాలకు వెళ్లి జూట్ మిల్లుల్లో పని చేస్తున్నారు. మరికొందరు ఉపాధి హామీ పథకం కింద పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మరి కొందరు సాలూరు పట్టణంలో పండ్ల దుకాణాలు నడుపుతూ, హెటళ్లలో పని చేస్తూ, ఆటోలను నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మిల్లు మూతపడి మూడేళ్లు దాటినా తెరిచే అవకాశం కనుచూపు మేరలో కనిపించకపోవడంతో బతుకుతెరువు కోసం దూరప్రాంతాలకు వలస పోతున్నారు.**

# జ్యూట్ కార్మికుల ఆకలి కేకలు

**ఏడాది కావస్తున్నా ఒక్క అడుగూ వేయని మంత్రి**

జీగిరాం జూట్ మిల్లును తెరిపించేందుకు గడిచిన 11నెలల కాలంలో టిడిపి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఒక్క అడుగు కూడా వేసిన దాఖలాలు లేవు. యాజమాన్యం, కార్మిక సంఘాల నాయకులతో కలిసి చర్చలు జరిపిన సందర్భం కూడా లేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారితే తమ బతుకుల్లో మార్పు వస్తుందని నమ్మి టిడిపికి ఓటు వేసిన కార్మికులు నేడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పని చేసిన రాజన్నదొర మిల్లు తెరిపించలేకపోయారని, టిడిపి ప్రభుత్వం మంత్రిగా ఉన్న సంధ్యారాణి తమ జీవితాల్లో వెలుగు రేఖలు తీసుకొస్తారని కార్మికులు ఆశించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న తరుణంలో ఇటీవల జ్యూట్ కార్మికుల నాయకులు, మహిళలు మంత్రి సంధ్యారాణిని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా జ్యూట్ మిల్లు తెరిపించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని అడగడానికి ఆమె వద్దకు వెళ్లారు. అయితే ఆ సమయంలో కార్మిక సంఘాల నాయకులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముందస్తు అపాయింట్మెంట్ తీసుకోకుండా ఎవరు రమ్మన్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతో కార్మిక సంఘం నాయకులు ఖంగుతిన్నారు. మంత్రి వైఖరితో తీవ్ర నిరాశకు కార్మికులు కక్కలేక మింగలేక అంతర్మథనం చెందుతున్నారు.

ప్రజాశక్తి - పార్వతీపురం

**మూడేళ్లుగా తెరుచుకోని జీగిరాం మిల్లు**

**అధికారంలోకి రాగానే తెరిపిస్తానన్న మంత్రి**

**ఏడాదవుతున్నా ఒక్క అడుగు పడని వైనం**

1986లో ఎన్టీఆర్ నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఎపి ఫైబర్స్ ప్రయివేట్ లిమిటెడ్ పేరిట జీగిరాంలో జ్యూట్ మిల్లు ఏర్పాటైంది. అత్యంత వెనుకబడిన గిరిజన నియోజకవర్గంలో నిరుపేద గిరిజనులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వ రంగంలో ఏర్పడిన జూట్ మిల్లు క్రమేణా ప్రయివేటు వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఒకదశలో మూడు వేలమంది పని చేసిన మిల్లులో క్రమేణా కార్మికుల సంఖ్య 1200కు పడిపోయింది. ముడిసరుకు రేటు పెరగడం, బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడడం వంటి అంశాలను సాకుగా చూపి మిల్లు యాజమాన్యం మూడేళ్ల క్రితం లాకౌట్ ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలో లాకౌట్ సమయం రెండేళ్లు గడిచిపోయింది. అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో కూడా గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న రాజన్నదొర మిల్లును తెరిపించేందుకు కొంత ప్రయత్నం చేశారు. కార్మిక సంఘాల నాయకులు, యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిగేలా చూశారు. రిటైరైన కార్మికులకు రావాల్సిన బకాయి లను యాజమాన్యంతో ఇప్పించే ప్రయత్నం చేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో మిల్లు తెరిపించే ప్రయత్నాలు అటకెక్కిపోయాయి. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి గెలుపు కోసం ప్రచారం చేపట్టిన టిడిపి యువనేత లోకేష్ కూడా జ్యూట్ మిల్లు తెరిపిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సంధ్యారాణి కూడా అధికారంలోకి వచ్చిన వెంటనే మిల్లు తెరిపిస్తానని భరోసా కల్పించారు. ఆమె హామీలపై నమ్మకంతో కార్మికులు ఏకపక్షంగా ఓటు వేసి టిడిపి గెలుపునకు దోహదపడ్డారు.

**మరణించినా, ఉద్యోగ విరమణ చేసినా చెల్లింపుల్లేవు**

గత మూడేళ్లలో లాకౌట్ సమయంలో జీగిరాం జూట్ మిల్లులో పని చేస్తున్న చాలా మంది కార్మికులు అనారోగ్యంతో మరణించారు. మరికొంతమంది ఉద్యోగాలకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఇంకొందరు ఉద్యోగ విరమణ చేశారు. కొంతకాలం పని చేసిన అనారోగ్యంతోనో, ప్రమాదాల వల్లనో మరణిస్తే అలాంటి కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం అండగా నిలబడాలి. వారికి చెల్లించాల్సిన పిఎఫ్, గ్రాట్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాల్సి ఉంది. అదే విధంగా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన వారికి కూడా బకాయిలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. కుటుంబ యజమాని అయిన కార్మికుడు మరణిస్తే రావాల్సిన బకాయి మొత్తంతో పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనో, పెళ్ళిళ్లు చేయాలనో వారి కుటుంబాలు ఆశిస్తాయి. అదే విధంగా విఆర్ఎస్ ఇచ్చిన, రిటైరైన కార్మికుల కుటుంబాలు కూడా ప్రణాళికలు రూపొందించుకుంటాయి. మిల్లు యాజమాన్యం ఇలాంటి కార్మికుల విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిల్లును నడపడమా లేదా కార్మికులకు సెటిల్మెంట్ చేసి సాగనంపడమా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన యాజమాన్యం ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తోంది. మిల్లు లాభాల్లో నడిచినంతకాలం వచ్చిన లాభాల సొమ్ముతో ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టిన యాజమాన్యం కార్మికుల ఆకలి తీర్చే ప్రయత్నం చేయడం లేదు. గడిచిన మూడేళ్లలో సుమారు 20 మంది కార్మికులు అనారోగ్యంతో మరణించారు. వీరికి చెల్లించాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించలేదు. ఈదుబిల్లి తిరుపతి, ఆల్తి బంగారు నాయుడు ఉపాధి లేక అనారోగ్యం కారణంగా ఏడాది క్రితం మరణించారు. వీరి బకాయిలు చెల్లించలేదు. ముద్రగిరి పద్మ, వేణు అనే కార్మికులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. రిటైరైన తర్వాత వచ్చిన డబ్బులతో కుమార్తెల పెళ్ళిళ్లు చేయాలని భావించారు. అప్పులు చేసి కుమార్తెల పెళ్ళిళ్లు చేశారు. ఏడాది గడుస్తున్నా వీరికి బకాయిలు చెల్లించలేదు.

జీగిరాంలో ఇళ్లకు తాళాలు వేసి వలసవెళ్లిపోయిన జ్యూట్ కార్మికులు

### పక్క జిల్లాల్లో తెరుచుకున్న జ్యూట్ మిల్లులు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో నెల్లిమర్ల జ్యూట్ మిల్లు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పునఃప్రారంభమైంది. భీమిలి నియోజకవర్గ పరిధిలోని చిన్నా పురం జూట్ మిల్లు కూడా ఇటీవలే తెరుచుకుంది. అయితే టిడిపి ప్రభుత్వంలో రెండు కీలకమైన శాఖలకు మంత్రిగా ఉన్న సంధ్యారాణి జీగిరాం జూట్ మిల్లు విషయంలో మౌనం వహించడం చర్చనీయాంశమవుతోంది.

### దేనికైనా సిద్ధమే

జీగిరాం జ్యూట్ మిల్లును తెరిపిస్తే పని చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని కార్మికులు చెపుతున్నారు. లేదంటే తమకు రావాల్సిన పిఎఫ్, గ్రాట్యుటీ బకాయిలు చెల్లించి సెటిల్ చేసినా అంగీకారమేనని భావిస్తున్నారు. తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయిన జ్యూట్ మిల్లులు ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల మూతపడ్డాయి. మిల్లులు నడపలేని పరిస్థితుల్లో యాజమాన్యాలు కార్మికులు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించేశారు. జ్యూట్ మిల్లుల స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వినియోగిస్తున్నారు. అటు కార్మికులకు ఇబ్బందులు కలిగించకుండా, తాము నష్టపోకుండా జ్యూట్ మిల్లు యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్లాయి.

### మిల్లు తెరిపించాలి

జీగిరాం జ్యూట్ మిల్లు మూసివేసి మూడేళ్ల వుతోంది. కార్మికులు ఆకలి మంటల్లో కొట్టుమిట్టాడుతున్నారు. అధికారంలోకి రాగానే మంత్రి సంధ్యారాణి మిల్లు తెరిపిస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. ఏడాది కావస్తున్నా మిల్లు తెరిపించేందుకు ఎలాంటి ప్రయత్నాలూ చేసిన దాఖలాల్లేవు. మరణించిన, రిటైరైన కార్మికుల కుటుంబాలకు యాజమాన్యం బకాయిలు చెల్లించాలి. ఇప్పటికే వందల సంఖ్యలో కార్మికులు ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వలసపోయారు. మిల్లు యాజమాన్యంపై మంత్రి ఒత్తిడి పెంచి కార్మికులకు న్యాయం చేయాలి.

**- ఎన్‌వై నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి**

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

# సిహెచ్‌ఒల సమస్యలు పరిష్కరించాలి

## సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం

నేషనల్ హెల్త్ మిషన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న సిహెచ్‌ఒల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సిహెచ్‌ఒల ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే వారి సంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎంలోని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చేయకుండా వివక్ష చూపుతుందని చెప్పారు. 2022 వరకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్లకు ఎంటిఎస్ అమలు చేసేదని చెప్పారు. 15 ఏళ్లుగా అమలైన ఈ విధానానికి గత ప్రభుత్వం తూట్లు పొడిచిందని తెలిపారు. దీనివల్ల ఎన్‌హెచ్‌ఎంలోని అన్ని క్యాడర్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హ్యూమన్ రిసోర్స్ పాలసీ అమలు చేయాలని కోరారు. సిహెచ్‌ఒల వేతనపెంపు, హెచ్‌ఆర్ పాలసీ, ఇన్సెంటివ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పిలు ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వహించకుండా అదనపు పనిభారాలను మోపుతున్నారని చెప్పారు. వారి సెంటర్లలో కాకుండా ఆయా ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో వారికి మధ్యాహ్నం వరకు వివిధ రకాల పనులను అప్పగిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల వల్లే వారి సమ్మె అనివార్యమైందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎంఎల్‌హెచ్‌పిల సంఘాల ప్రతినిధులందరితో చర్చించాలని డిమాండ్ చేశారు. శిబిరానికి వచ్చి 104 యూనియన్ నాయకులు డి ఆనందరావు మద్దతు తెలిపారు.

## ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సొంతంగా ఇల్లు నిర్మించుకొనేందుకు ఇంటి స్థలం లేని అర్హులైన లబ్ధిదారులు ఇంటి స్థలం కోసం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో దరఖాస్తు చేసుకొనవచ్చునని స్థానిక తహశీల్దార్ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సొంతంగా ఇల్లు నిర్మించుకొనేందుకు ఇంటి స్థలం లేని అర్హులైన లబ్ధిదారులు తమ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లాగిన్ లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు దారులకు రాష్ట్రంలో ఎక్కడ ఇల్లు, ఇంటి స్థలం దరఖాస్తు దారును పేరున గానీ, ఆ కుటుంబంలోని వ్యక్తుల పేర్లతో గానీ ఉండరాదని, బియ్యం కార్డు, ఆధార్ కార్డు కలిగి ఉండవలెనని, మూడు ఎకరాల కంటే ఎక్కువ పల్లం భూమి దాటిన వారు దరఖాస్తుదారులు కలిగి ఉండరాదని, వార్షికాదాయం రూ.1,20,000 కంటే తక్కువ ఉండవలేనని తెలిపారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులై ఉండకూడదని, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండరాదని, టాక్సీ, ఆటో, ట్రాక్టర్ వంటి వాహనాలు కలిగి ఉండవచ్చునని, ఇప్పటికే లబ్ధిదారులు రేషన్ కార్డుపై ప్రభుత్వం ద్వారా ఇల్లు పట్టా గానీ, ఇల్లు గాని పొంది ఉండరాదని అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరూ ఇంటి స్థలం కోసం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హులైన లబ్ధిదారులకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు అర్హులకు మంజూరు చేస్తామని ఆమె ప్రకటనలు తెలిపారు.

# జిల్లాలో విస్తృతంగా వర్షాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా పార్వతీపురం మన్యం జిల్లాలో విస్తృతంగా వర్షాలు కొరవడంతో పాటు ఈదురు గాలుల వల్ల అక్కడక్కడ రహదారి పక్కనే ఉన్న చెట్లు విరిగిపడి ప్రయాణాలకు ఆటంకాలు ఏర్పడిన సంఘటనలు జరిగాయి. పార్వతీపురం మండలం ఎంఆర్ నగరం, పెద్ద బొండపల్లి గ్రామాల మధ్య చెట్లు విరిగిపడడం వల్ల రాకపోకలకు అనంతరం కలిగి, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసినప్పటికీ పాలకొండ డివిజన్ పరిధిలోని మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదు కాగా, పార్వతీపురం డివిజన్లో వర్షాలు ఎక్కువగా కురిసింది. సాలూరు రూరల్ ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 164.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా, జిల్లా సగటు 10.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. వారు అందించిన వివరాల ప్రకారం సీతంపేట 6.4, భామిని 10.2, కొమరాడ 18.4, గుమ్మలక్ష్మీపురం 2.4, కురుపాం 1.8, జిఎంవలస 1.0, గరుగుబిల్లి 6.8, పార్వతీపురం 28.6, మక్కువ 12.6, సీతానగరం 36.2, బలిజిపేట 15.4, సాలూరు 8.4, పాచిపెంట 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలపగా అత్యధికంగా సీతానగరంలో 36.2, అత్యల్పంగా జియ్యమ్మవలసలో 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వివరాలు అందజేశారు. రాబోయే రెండు రోజుల్లోనూ జిల్లాలో విస్తృతంగా వర్షాలు ఉంటాయని, అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నందువల్ల ప్రజలు పొలాలకు వెళ్లేవారు రైతులు ఉపాధి వేతనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

**వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జెసి**

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ జిల్లా కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక తెలిపారు. వాతావరణ శాఖ విడుదల చేసిన సూచనల మేరకు జిల్లా అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎల్లో అలెర్ట్ ను వాతావరణ శాఖ ప్రకటించిందని ఆమె చెప్పారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, గాలులు 60 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు చేసిందన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. భారీ వర్షాలు కారణంగా ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రదేశాలు గుర్తించి అటువంటి ప్రదేశాల వద్ద అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రహదారులు, కల్వర్టు పైనుండి నీరు పారే చోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎంఆర్‌నగర్-పెద్దబొండపల్లి రోడ్డుకు అడ్డంగా విరిగిన చెట్టు

# పిహెచ్‌సిల్లో ప్రసవాల మెరుగుకు కృషి చేయాలి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

మాతా, శిశు వైద్య సేవలు, పిహెచ్‌సి ప్రసవాలు మెరుగుకై స్టాఫ్ నర్సులకు ఎస్బిఎ శిక్షణ నిర్వహించామని, వారు ఆ దిశగా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎస్‌బిఎ శిక్షణ పూర్తి చేసుకున్న పిహెచ్‌సి స్టాఫ్ నర్సులకు ధ్రువ పత్రాలను శనివారం సాయంత్రం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య కార్యాలయంలో అందజేశారు. శిక్షణా నైపుణ్యాన్ని సద్వినియోగం చేయాలని డిఎంహెచ్‌ఒ వారికి సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీలకు వైద్య సేవలను మరింతగా మెరుగుపర్చే లక్ష్యంగా పిహెచ్సీల్లో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా కృషి చేసే దిశగా స్టాఫ్ నర్సులకు ఎస్‌బిఎ (స్కిల్డ్ బర్త్ అటెండెంట్) రీఓరియంటేషన్ శిక్షణను నిర్వహించామని తెలిపారు. ఫిబ్రవరిలో ప్రారంభించి బ్యాచ్‌ల వారీగా ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగించామన్నారు. ప్రతి బ్యాచ్‌కు 21 రోజులు శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఇందులో ఒక వారం ఆరోగ్య కార్యాలయంలో, రెండువారాలు జిల్లా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. హై రిస్క్ ఆరోగ్య సమస్యలు ముందుగా గుర్తించడం, ప్రసవ సమయంలో తలెత్తే సమస్యలు నివారించడం, సురక్షిత ప్రసవం, శిశువుకు ప్రాథమిక, అత్యవసర సంరక్షణ అందించడం మొదలగు అంశాలపై శిక్షణ పూర్తి చేయడం జరిగిందన్నారు. పిహెచ్‌సిలో ప్రసవాలు మెరుగు పడేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ ఎం.నారాయణరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డా కెవిఎస్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ పిఎల్ రఘుకుమార్, డిపిహెచ్‌ఎన్‌ఒ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సులకు ధ్రువపత్రాలు అందజేసిన డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

# అరటి రైతులకు లాభాల పంట

**భారీగా పెరిగిన ఎగుమతులు**

**టన్నుకు రూ.16 వేల నుంచి రూ.24 వేలు వరకు ఆదాయం**

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఈ ఏడాది అరటి రైతులు లాభాలు చూస్తున్నారు. అనేక ఏళ్లుగా ఈ పంటను సాగుచేస్తున్నా ఎప్పుడూ ఇంత ధరలను చూడలేదని, ఈ సీజన్‌లో ఎక్కువ ధరలను పొందుతున్నామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంటను సాగుకు అధిక పెట్టుబడులు, ఈదురు గాలులతో ఎప్పుడూ నష్టాల బాటనే పడుతుండేది. ఈ ఏడాది ముఖ్యంగా పెళ్లిళ్లు, ఉగాది, శ్రీరామనవమి తదితర పండగలు రావడంతో పాటు ఇవి ఎక్కువగా పండించే కొన్ని రాష్ట్రాల్లో వీటి దిగుబడి తగ్గడంతో ఇక్కడ అరటి సాగు చేసే రైతులకు లాభాలు తెచ్చిపెట్టింది. మోటార్ల ద్వారా వ్యవసాయం చేసే ప్రాంతాలు ఎక్కువగా ఉండడం వల్ల ఈ ప్రాంతానికి గోదావరి జిల్లాల నుండి వచ్చి స్థిరపడ్డ రైతులు ఎక్కువగా అరటి సాగు చేయడంతో గోదావరి జిల్లాలతో పాటు ఇక్కడా అధికంగా అరటి సాగు చేస్తున్నారు. ఈ పంటను ఎక్కువగా పండించేందుకు మొక్క వేసినప్పుడే వ్యాపారులు ముందుగానే రైతులకు పెట్టిబడులు ఇస్తుంటారు. ఈ కారణంతో ఈ పంటపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ప్రతి ఏటా ఈదురు గాలులు, తుఫానులు, తెగుళ్లతో బాధపడుతూ నష్టభయంతో దీన్ని సాగుచేస్తున్నారు. కానీ ఈ సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో ఈ పంట ఆశాజనాకంగా లేకపోవడంతో ఈ ప్రాంతంలో పండే కర్పూర, దేశవాలి, జి 9 రకాల అరటికి మంచి ధర వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.16 వేలు నుంచి రూ.24 వేల వరకు పలుకుతుంది. గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న ఈ పంటకు ఈ ధర ఎప్పుడూ రాలేదని, ఈ సీజన్లోనే ఇటువంటి ధర చూస్తున్నామని స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాలూరు నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల పరిధిలో ఎక్కువగా అరటిని సాగుచేస్తున్నారు. ఈ అరటిపై ఈ మూడు మండలాల్లో సుమారు వెయ్యి మంది రైతులు, 2వేల మంది కూలీలు, 150 మంది వ్యాపారస్తులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

**రోజు 15 నుండి 20 లారీల వరకు ఎగుమతి**

ఈ ప్రాంతాల్లో పండే అరటిని ముఖ్యంగా ఒడిస్సా, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గడ్, నేపాల్ ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇన్నేళ్లుగా ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగుచేస్తున్న గత కొన్నేళ్లుగా అరటి పంటకు ప్రభుత్వం ఎటువంటి రాయితీలు అందజేయడం లేదని, దీని వలన కూడా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా ఈ అరటిపంట గాలులకు ఎక్కువగా నేలకొరుగుతాయని, దీనిద్వారా నష్టం అధికమవుతుందని, ధరలు కూడా ఎల్లప్పుడూ ఇంతలా ఉండవని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ పంటలకు ఈ ప్రాంతంలో నిల్వ చేసుకొలా కోల్డ్ స్టోరేజ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లయితే రేట్లు అధికంగా ఉన్నప్పుడు వీటిని అమ్ముకునే వేసులుబాటు కలుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇటువంటి విధానాన్ని ఈ ప్రాంతంలో నెలకొల్పి రైతులకు మేలు చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎగుమతులకు సిద్ధంగా ఉంచిన అరటి గెలలు

## రేవతిగూడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఆంధ్రా- ఒడిశా సరిహద్దు పార్వతీపురం మండలం పెదమరికి పంచాయతీకి ఆనుకుని ఉన్న రేవతిగూడకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఆదివారం గిరిజన సంఘ నాయకులు పి.రాముతో కలిసి గ్రామస్తులు మాట్లాడుతూ తాము ఒడిశా ప్రాంతంలో ఉన్నప్పటికీ మౌలిక సదుపాయాల్లేక ఇబ్బందులు పడుతున్నామని, ఇటీవల తమ గ్రామాన్ని పెదమరికి పంచాయతీలో కలపాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి అందించామని అన్నారు. సుమారు 200 మంది కుటుంబాలు ఉన్న తమ గ్రామానికి పార్వతీపురం వెళ్లి వైద్య సౌకర్యం పొందడం కోసం సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వృద్ధులను, గర్భిణులను డోలీలు కట్టి పార్వతీపురం తీసుకు రావాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి తమను పార్వతీపురం మండలంలో కలపడమే కాకుండా రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

నిందితులతో మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణరావు

## దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కురుపాం

దొంగతనాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై పి.నారాయణరావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో కురుపాం, ఎల్విన్ పేట, నీలకంఠపురం, చిన్నమేరంగి, జియమ్మవలస, గరుగుబిల్లి, పోలీస్ స్టేషన్ల పరిధిలో గల దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్న వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు పలు దొంగతనాల కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారని, ఇకపై ఎటువంటి దొంగతనాలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వారి జీవనాధారం గూర్చి తెలుసుకొని బతుకు తెరువు కోసం పలు సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**సీతంపేట:** ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక తహశీల్దార్ పి.అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హులైన పేదలకు స్థలం ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.

## 11న ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడి గ్రామ జంక్షన్ వద్ద గల సత్య సాయి నిత్య అన్నపూర్ణ సేవా కేంద్రంలో ఈనెల 11న విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన వారు ఆధార్, బ్యాంకు ఖాతా వంటివి గుర్తింపు కార్డులు తీసుకురావాలని, దీర్ఘకాలిక రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

## ఎటివి రైడ్స్ పునఃప్రారంభం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఎన్టీయార్ అడ్వంచర్ పార్క్‌లో ఎటివి వాహనాల రైడ్స్ తిరిగి పునః ప్రారంభించబడ్డాయి. గతంలో ఉన్న వాహనాలు మరమ్మతులకు గురి కావడంతో కొంతకాలం ఎటివి (ఆల్ ట్రైన్ వెహికల్స్ రైడ్స్) పర్యాటకులకు అందుబాటులో లేవు. ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మళ్లీ రెండు కొత్త ఎటివి వాహనాలు కొని పునః ప్రారంభించారు. ఆదివారం నుంచి ఈ వాహనాలు పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

సూర్యనారాయణకు పుస్తకాన్ని అందజేస్తున్న గ్రంథాలయాధికారి గణేష్‌బాబు

## మహిళాభివృద్ధి పుస్తక వితరణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అమెరికాలో ఉంటున్న ప్రొఫెసర్ ఇఎ నారాయణ, డాక్టర్ ఇఎ లక్ష్మి రాసిన భారత దేశంలో మహిళాభివద్ధి పుస్తకాన్ని కోటదుర్గ గుడి మాజీ చైర్మన్ కోరాడ సూర్యనారాయణ(బాబు)కు, స్థానిక శాఖా గ్రంథాలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ కె.శివ, పడాల మధుసూదనరావు, బొత్స వాసు, కె . చిన్న, ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు పాల్గొన్నారు.

**విద్యార్థులకు క్రీడలు**

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు మానసిక ఆరోగ్యం కోసం మ్యాజిక్ చైర్ ఆటలు ఆడించారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

## శంభంలో మామిడికాయ ఉజ్జిడి పండగ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని శంభంలో ఆదివారం గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలతో మామిడికాయ ఉజ్జిడి పండుగ నిర్వహించారు. పిల్లలకు మంచి జరుగుతుందన్న నమ్మకంతో పిల్లలపైన ఉజ్జిడిని తీసుకుని వెళ్లారు. ప్రకృతి చల్లగా చూడాలని గిరిజనులు కొలిచారు. పితృదేవతులు చల్లగా చూడాలని, పశుసంపద, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ఇలాంటి పండగలు నిర్వహిస్తారు.

## పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్వరలో జరగనున్న 75 వసంతాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం పూర్వ విద్యార్థులు కలిశారు. పాఠశాలలో చదివిన అప్పటి ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని, కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి సిద్ధంగా హెల్త్ బ్లాక్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఉన్న హెల్త్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. సుమారు రూ.50 లక్షల అంచనా వ్యయంతో రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు చేపట్టారు. అన్ని హంగులు పూర్తిచేసుకుని ప్రారంభించేందుకు హెల్త్ బ్లాక్ సిద్ధంగా ఉంది.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న హెల్త్‌బ్లాక్ కేంద్రం

# ఉద్యమాల ఊపిరి ..శేషగిరి

**నేడు నాలుగో వర్ధంతి సభ**
**'తరుగులేని కీర్తి సిరి' పుస్తకావిష్కరణ**

ప్రజాశక్తి-విజయనగరం

అందరూ గిరి మాస్టారూ.. అని ఆప్యాయంగా పిలిచే కోరెడ్ల శేషగిరి తన 48 ఏళ్ల జీవిత కాలంలో 28 ఏళ్లు ఉద్యమమే ఊపిరిగా జీవించారు. యుటిఎఫ్ నాయకుడిగా ఉపాధ్యాయ, ఉద్యోగుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రజా క్షేత్రంలోనే ఉండేవారు. నిత్యం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను అధ్యయనం చేసి పోరుబాట పట్టారు. ఐక్య ఉద్యమాల రథసారథిగా అందరి మన్ననలు పొందారు.

1992 నుండి 94 వరకు ఎస్ఎఫ్ఐ నాయకుడిగా జిల్లాలో విద్యార్థి ఉద్యమ అభివృద్ధికి శేషగిరి కృషి చేశారు. ఎన్‌టి రామారావు రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 1994 డిఎస్‌సిలో అవకతవకలు జరిగాయని డిఎస్‌సిని రద్దు చేశారు. ప్రభుత్వం తప్పుడు నిర్ణయం వెనక్కి తీసుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని విజయనగరం నుండి ఉద్యమం ప్రారంభించారు. ఆ నాయకత్వంలో శేషగిరి, యుటిఎఫ్ నాయకులు డి.రాము ముఖ్యులు. ఆ ఉద్యమాన్ని రాష్ట్రమంతా విస్తరింప జేయడం, పోరాటాలు రూపొందించడంలో వీరు ప్రముఖ పాత్ర నిర్వహించారు. రెండేళ్ల ఉధృత పోరాటాల అనంతరం ఎన్‌టి రామారావు ప్రభుత్వం నిర్ణయం మార్చుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించింది.

**జిల్లాలో యుటిఎఫ్ విస్తరణలో ముఖ్య పాత్రధారి**

ఆ పోరాటం ఘనవిజయం సాధించడంలో ముఖ్యభూమిక పోషించిన శేషగిరి జిల్లా వ్యాప్తంగా నియమితులైన ఆ బ్యాచి ఉపాధ్యాయులను యుటిఎఫ్‌లో సభ్యులుగా చేర్పించి సంఘటిత పర్చడంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. అందువల్లే విజయనగరం డివిజన్‌లో కొద్ది మండలాలకు పరిమితమై ఉన్న యుటిఎఫ్ ఒకేసారి జిల్లాలో అన్ని మండలాలకు, మున్సిపాలిటీలకు విస్తరించింది. అప్పటి నుండి జిల్లాలో సంఘాన్ని బలపర్చడంలో శేషగిరి ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. శేషగిరి నిరంతర అధ్యయన శీలి. సిద్ధాంత అధ్యయనమే గాక స్థానిక సమస్యలపై అధ్యయనం చేసేవారు. ఉపాధ్యాయులు, విద్యా సంబంధిత సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ చేశారు. అందువలనే అతనికి సిద్ధాంతం మీదే కాదు స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉండేది. అన్ని యాజమాన్యాల్లో ఉపాధ్యాయులకు శేషగిరి ఆప్తుడయ్యారు. అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడయ్యారు.

**సైద్ధాంతిక కృషీవలుడు**

విధానపరంగా ప్రపంచం, దేశం, రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న మార్పులను సైద్ధాంతిక, రాజకీయ కోణంలో దూరదృష్టి నుంచి అర్థం చేసుకోవడం శేషగిరి ప్రత్యేకత. వాటిపై ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అవగాహన కలిగించేవారు. అందుకు జిల్లాలో టీచర్స్ అండ్ ఎంప్లాయిస్ స్టడీసర్కిల్‌ను రెగ్యులర్‌గా నిర్వహించారు. తరువాత గురజాడ అధ్యయన వేదిక పేరుతో ఆ కృషిని నిరంతరాయంగా కొనసాగించారు. ఆర్థిక రాజకీయ సామాజిక పరిణామాలపై సదస్సులు, సెమినార్లు నిర్వహించేవారు. అనుబంధాలతో నిమిత్తం లేకుండా అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని కార్యాచరణకు పూనుకొనేవారు. ప్రదర్శనలు, బహిరంగ సభలకు వందలు, వేలాది మందిని సమీకరించేవారు. అందువలనే జిల్లాలో ఐక్య ఉద్యమాల రథసారథిగా శేషగిరి అందరి మన్ననలు పొందారు.

**విధానాలపై పోరాట యోధుడు**

నాడు సిపిఎస్, నేడు నూతన విద్యావిధానంపై లోతైన అధ్యయనం చేసి అంతే పట్టుదలగా ఉపాధ్యాయులను, విద్యార్థులను విజయనగరం జిల్లాలో కదిలించడంలో శేషగిరి ముఖ్య పాత్ర పోషించారు. సిపిఎస్ ముప్పును గుర్తించిన తొలి రోజుల్లో విజయనగరం జిల్లాలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారు. అలాగే మోడీ 2020 నూతన విద్యా విధానాన్ని సమూలంగా అర్థం చేసుకొని దానిపై ప్రతి హైస్కూల్ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, పెద్ద ఎత్తున అన్ని సంఘాల నాయకత్వాన్ని ఒప్పించి పెద్ద పెద్ద ప్రదర్శనలు, సభలు నిర్వహించారు. మోడీ ప్రభుత్వం సర్వ రంగాల ప్రైవేటీరణపై వెలువడుతున్న వ్యతిరేకతను కూడగట్టి అందరినీ ఒకచోటకు చేర్చి సంఘటితం చేయాలనే ఉద్దేశంతో 18-4-2021న విజయనగరంలో శేషగిరి నిర్వహించిన సభ అతని జీవితంలో చివరిది.

**నిబద్ధత , ఉద్యమ స్ఫూర్తి గల నాయకుడు**

జిల్లాలో అక్షరాస్యతా ఉద్యమంలో శేషగిరి పని చేశారు. శేషగిరి శాస్త్రీయ దృక్పథం గల వ్యక్తి. యుటిఎఫ్ బాధ్యతల్లో ఉన్నా జనవిజ్ఞాన వేదిక లో చురుకైన పాత్ర నిర్వహించారు. శాస్త్ర కళా జాత, అక్షర కళా జాత నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించారు. జిల్లాలో సాహితీ స్రవంతి ప్రారంభానికి కవులను, రచయితలను సమీకరించి విజయనగరంలో సాహితీ స్రవంతి ప్రారంభ సభ నిర్వహణకు చాలా కృషి చేశారు. శేషగిరి గొప్ప వాదనాపటిమ గలిగినవారు. ఉద్యమం పట్ల నిబద్ధత కలిగి ఎదుటివారి వాదనలో పొరపాట్లను పూర్వపక్షం చేసి తన వాదనలో విషయం అర్థమయ్యేలా చెప్పేవారు. ఉద్యమాభివృద్ధి తప్ప వ్యక్తిగత కీర్తి ఖండూతి లేనివారు. అందుకే ఆయన మరణించి నాలుగేళ్లయినా ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆయనను మరవలేకున్నారు.

**నేడు శేషగిరి వర్ధంతి సభ**

యుటిఎఫ్ నాయకులు కోరెడ్ల శేషగిరి నాలుగవ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం 10గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన సభ జరుగనుంది. ఈ సందర్భంగా ఆయన రాసిన వ్యాసాలతో ముద్రించిన 'తరుగులేని కీర్తి సిరి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా' భారత ఫెడరలిజం సవాళ్లు' అనే అంశంపై శాసనమండలి మాజీ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు స్మారకోపన్యాసం చేయనున్నారు. అతిథులుగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరునాయుడు హాజరు కానున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరై ఈ సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు కోరారు.

# బతుకు పోరులో... విగత జీవులై

- ఉపాధి కోసం వలస వెళ్తూ మృతువాతపడుతున్న యువత
- శిక్షణ కరువైంది... ఉపాధి దూరమైంది ...
- నాలుగేళ్లుగా మూతపడ్డ వైటిసిలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉన్న ఊరిలో ఉద్యోగం, ఉపాధి లేక గత్యంతరం లేని పరిస్థితిలో బతుకు తెరువు కోసం దూరప్రాంతాలు వలస వెళ్తున్న గిరిజన యువత ఏదో ఒక కారణం చేత మృత్యుఒడికి చేరుతున్నారు. తమ బిడ్డ కాయ కష్టం చేసి జీవితంలో స్థిరపడతాడని, కుటుంబానికి అండగా నిలుస్తాడని ఊహించిన తల్లిదండ్రుల ఆశలు తమ పిల్లల మరణ వార్తతో అడియాసలుగానే మిగులుతున్నాయి. ఇంటికి పెద్ద దిక్కుగా అందోచ్చిన కొడుకు అండగా ఉంటాడని అనుకుంటే నిండు నూరేళ్ల నిండకుండానే అకాల మరణం చెందడంతో కన్నవారి వేదన గుండెలు పగిలేలా ఆ ఇంట విషాదం వర్ణాతీతం.

**ఉపాధి శిక్షణ ఇవ్వాలి**

కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల బాధలను గుర్తించి వైటిసిలను తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న వందలాదిమంది గిరిజన యువతీ యువకులకు శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉపాధి కల్పించాలి. వలసల నివారణ అరికట్టాలి.

**మండంగి రమణ,**
**ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.**

జిల్లాలో ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట, కొమరాడ ఏజెన్సీ మండలాల్లో పారిశ్రామిక అభివృద్ధి లేకపోవడంతో గిరిజన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది ప్రజా ప్రతినిధులు, అధికారులు మారినా ఉపాధి కల్పన మార్గాలు మాత్రం చూపించలేదు. వైటిసి కేంద్రాల్లో ఉపాధి శిక్షణ ఇచ్చిన కొన్నాళ్లకే మూతపడింది. దీంతో గిరిజన యువత వలసబాట వైపు అడుగులు వేస్తోంది. గత కొన్నేళ్లుగా పై రెండు మండలాల్లో గిరిజన యువత ఉపాధి కోసం విశాఖ, రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్తున్నారు. పనిచేస్తున్న చోట ఏదో ఒక కారణంచేత మృతి చెందుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు గిరిజన యువత మరణించడం అత్యంత బాధాకరం. ఇందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి పంచాయతీ వండిడికి చెందిన మండంగి కిరణ్, కురుపాం మండలం డంగులగూడకు బిడ్డిక ప్రశాంత్ ఉపాధి కోసం వెళ్లి అకాల మరణం చెందారు. జిల్లాలో ఉపాధి అవకాశాల్లేకపోవడంతో ప్రతి ఏటా వలసలు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతుంది. రోజు రోజుకు నిరుద్యోగ సమస్య పెరగడంతో స్థానికంగా ఏ పనులు లేక యువత దూర ప్రాంతాలకు వెళ్లి వివిధ కంపెనీల్లో చేరుతున్నారు. 15 మండలాల్లో వేలాది మంది యువతీ యువకులు జీవనోపాధికై వలసబాట తప్పడం లేదు. మన్యం జిల్లాలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులు ఉన్నా ఆ దిశగా చర్యలు కానరావడం లేదు.

**శిక్షణ కరువైంది... ఉపాధి దూరమైంది**

గత నాలుగేళ్లుగా యూత్ ట్రైనింగ్ కేంద్రాలు (వైటిసి) మూత పడడంతో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ కరువైంది. తద్వారా ఉపాధి కల్పన దూరమైంది. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన వైటిసి కేంద్రాలు ఉపాధి శిక్షణ లేక వెలవెలబోతున్నాయి. నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో ఉపాధి శిక్షణ అందించేందుకు టిడిపి హయాంలో జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, సాలూరు, పార్వతీపురంలో వైటిసిలను ఏర్పాటు చేశారు. వైటిసిల నిర్వహణ, అందులో పని చేస్తున్న ఉద్యోగుల జీతాల కోసం ట్రైకార్ నిధులను వినియోగించేవారు. 2017 నుంచి 2019 వరకు ఎంతోమంది నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు కంప్యూటర్, టైలరింగ్, డ్రెస్‌మేకింగ్, డ్రైవింగ్ తదితర విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేవారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు రోజుకు రూ.160 చొప్పున సమకూర్చేవారు. రెండు నెలలు శిక్షణ ఉండేది. శిక్షణ నిర్వాహలకు రూ.10వేలు చొప్పున చెల్లించేవారు. శిక్షణ కోసం కంప్యూటర్లు, కుట్టుమిషన్లు సమకూర్చారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు యువత హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లి స్థిరపడ్డారు.

**నాలుగేళ్లుగా మూతపడ్డ వైటిసి**

గత ప్రభుత్వం హయాంలో ఏడాది పాటు వైటిసిల నిర్వహణ సక్రమంగా సాగింది. అయితే కరోనా మహమ్మారి రావడంతో శిక్షణను నిలిపివేశారు. కోవిడ్ తగ్గుముఖం పట్టినా శిక్షణ తిరిగి ప్రారంభించలేదు. నాలుగేళ్లుగా ఉపాధి శిక్షణ లేక నిరుద్యోగ గిరిజన యువత నిరాశలో ఉన్నారు. పార్వతీపురం వైటిసిలో ఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేశారు. గుమ్మలక్ష్మీపురం వైటిసిలో గిరిజన గర్భిణీల వసతి గృహాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. అయితే గిరిజన యువతకు ఉపాధి శిక్షణ లేకపోవడంతో వలసలు వెళ్లిపోతున్న పరిస్థితి. ఇందులో పనిచేస్తున్న సిబ్బందికి నెలలు తరబడి వేతనాలందక ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన వైటీసీ కేంద్రాలు ఉపాధి శిక్షణ లేక వెలవెలబోతున్నాయి.

**వైటిసిల నిర్వహణకు నిధులు కేటాయించాలి**

వైటిసిల నిర్వహణకు నిధులు కేటాయించి పూర్వ వైభవం తీసుకురావాలి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వందలాదిమంది గిరిజన నిరుద్యోగులకు వివిధ విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి మార్గాలు చూపించాలి.

**కోలక అవినాష్ ,**
**ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.**

# తప్పని తాగునీటి కష్టాలు

**కూతవేటు దూరాన రిజర్వాయర్ ఉన్నా అవస్థలు**
**గ్రేడ్ వన్ మున్సిపాలిటీ ప్రజల దుస్థితి**

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

కూతవేటు దూరాన రిజర్వాయర్ ఉన్నా పట్టణంలోని సాయినగర్‌కాలనీ ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడంలేదు. గోతుల్లోని నీటిని చేదలతో (రేక)లతో తోడుకుంటూ బిందెలు నింపుకోవాల్సిన పరిస్థితి. దశాబ్దాలు దాటిన తాగునీటి కష్టాలు తప్పడంలేదు. ఇదీ గ్రేడ్-1మున్సిపాల్టీ దుస్థితి.

పట్టణంలోని బెలగాంలో 16వ వార్డులో గల సాయినగర్ కాలనీకి కూతవేటు దూరంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఎదురుగా తాగునీరు సరఫరా చేసే రిజర్వాయర్ ఉంది. ఈ వార్డులో పరిధిలో గల పలు వీధుల్లో తాగునీరు సరఫరా చేసే సమయాల్లో కుళాయిల గోతుల్లో స్థానిక మహిళలు చేదలతో తోడుతేగాని తమ బిందెలు నిండని పరిస్థితి ఉంది. దీనివల్ల స్థానిక మహిళలు కీళ్ళ, నడుము నొప్పుల బారిన పడుతున్నారు. దశాబ్దాలుగా ఈ సమస్య పరిష్కార దిశగా ఆ వార్డులో పలుమార్లు ఎన్నికైన కౌన్సిలర్లు గానీ, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది గానీ దృష్టి పెట్టకపోవడం గమనార్హం. ఈ వార్డుతో పాటు పట్టణంలోని జగన్నాథపురంలో గల రిజర్వాయర్‌కు సమీపంలోనే 29వ వార్డు రామాపురం కాలనీలోని పలు వీధుల్లో గల కొళాయిల వద్ద గుమ్ముల్లో దిగితే గాని తాగునీరు దొరకని పరిస్థితి ఉంది. పట్టణ జనాభా 60 వేలు దాటే ఉంది. కొత్తగా పలు కాలనీలు కూడా విస్తరించాయి. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాకు 5 రిజర్వాయర్లు ఉన్నాయి. 72 కిలోమీటర్ల పైప్ లైన్ విస్తీర్ణం ఉంది. పట్టణ ప్రజలకు ప్రతిరోజూ 8.5 ఎంఎల్‌డి నీరు సరఫరా చేయాలి. కానీ కానీ 5ఎంఎల్‌డి తాగునీరు మాత్రమే సరఫరా జరుగుతోంది. కొన్ని వార్డుల్లో 2 రోజులకు, 3 రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుందని స్థానికుల నుంచి బహిరంగ విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం తోటపల్లి జలాశయం సమీపానలో నిర్మించిన ఇన్‌ఫిల్టరేషన్ బావులు శిథిలావస్థ స్థాయికి చేరుకోవడంతో వర్షాకాలం రంగు మారిన నీరు సరఫరా, వేసవిలో అరకొర తాగునీరు సరఫరా జరుగుతోంది. ఈ సమస్య పరిష్కరించే దిశగా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేసేందుకు 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.62 కోట్లతో పైలెట్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఎన్నికలు రావడంతో ఆ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. 2019లో వైసిపి హయాలో రూ.63 కోట్ల 63 లక్షలతో మళ్లీ ఆ ప్రాజెక్టుకు సంబంధించి పైపులైన్ నిర్మాణ పనులు జరిగినప్పటికీ ఆ పనులు కూడా అర్థాంతరంగా ఆగిపోయాయి. ఇప్పుడు మళ్లీ అవే పనులకు రూ.80 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ చేయాల్సిన పనుల అంచనాలు పెరుగుతున్నాయే తప్ప పనులు జరగడం లేదన్న విమర్శలు పట్టణ ప్రజల నుంచి జోరుగా వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుళాయి గోతుల్లో చేదతో తోడుతూ తాగునీరు తోడుతున్న మహిళలు

సుదూరం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న పూతికవలస గిరిజన మహిళలు

## పూతికవలసలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని బొర్రమామిడి పంచాయతీ పూతికవలస గిరిజనులు తాగునీటి కోసం కిలోమీటరుకు పైగా కొండమీదకు నడిచి వెళ్లి గెడ్డ ఊటనీటిని తాగుతున్నారు. ఈ గెడ్డవాగు నీరు కూడా వేసవిలో బాగా ఎండిపోతుంటాయి. నీరు ఉండదు మళ్లీ గట్టిగా వర్షం పడితేనే నీరు వస్తుంది. దీనివల్ల అష్టకష్టాలు పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పూతికవలస గిరిజనులు పోయి సీతమ్మ, సొయ్యారి రాములమ్మ, ఎస్.అంకమ్మ, పి.లచ్చుమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కరించి గ్రామంలో తాగునీటి బోరు వేసి వేసవిలో కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి మౌలిక సదుపాయాల పట్ల దృష్టి సారించాలని కోరారు. తాగునీటి సమస్యపై కలెక్టర్, మంత్రి ప్రత్యేక దృష్టి పెట్టి ఏజెన్సీలో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక గిరిజనులు రామారావు, కామయ్య, పి.శ్రీరాం, సుయ్యారి బుడ్డయ్య, పి.సుకరయ్య, గవరయ్య, పి.చిన్నారావు, సొయ్యారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ సిగ్నల్స్ పనిచేయక ఇబ్బందులు

- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోని బిఎస్ఎన్ఎల్ అధికారులు
- జియో పరిస్థితి కూడా అంతే

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ, వలసబల్లేరు, మొండెంఖల్ తదితర గ్రామాల్లో బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ ఎప్పుడు వస్తాయో ఎప్పుడు పోతాయో తెలియక సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. దూర ప్రాంతంలో తమ బంధువుల యోగక్షేమాలు తెలుసుకొనే అవకాశం లేక అత్యవసర సమయంలో సమాచారం ఇవ్వలేక సతమతమవుతున్నారు. బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ పనిచేయడం లేదని వినియోగదారులు మొర పెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నెట్ బిల్లులు టాప్ అప్ బిల్లులు వృథా అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. మరోవైపు జియో నెట్వర్క్ సెల్ సిగ్నల్ కూడా పనిచేయడం లేదు. ఒక్కొక్క సమయంలో సిగ్నల్ వస్తూ పోతూ ఉంటుంది. దీంతో వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నెట్వర్క్ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

## ప్రకృతి సోయగాలు... చీపురువలస పర్వతాలు

**చూపరులను కనువిందు చేస్తున్న అందాలు**

ప్రజాశక్తి - సాలూరు

చూట్టూ పచ్చని పైరు గాలి... పచ్చని చెట్లు మధ్య ఎత్తైన పర్వతశిఖరంపై అందాల జలపాతాలు చూడ ముచ్చటగా ప్రకృతిని కనువిందుచేసి అనుభూతి నిచ్చింది. ప్రకృతి అందించిన అందాల్లో ప్రధానమైంది పర్వతాలు.. ఎత్తయిన పర్వతాలతో వికసించిన పూల పరిమళాలు.. పర్వతాలపై నుంచి జాలువిరిచిన వర్షం, నీటి బిందువు.. వెళ్లు విరిచింది. చల్లటి గాలి మంచు బిందువులతో జాలు విరించిన ప్రకృతి అందాలు అహ్లాదభరితంగా చూపరులను కలువిందు చేసిన ప్రకృతి అందాలు..అదేనండి..గజదేవర కొండ..

మండలంలోని చీపురువలస సమీపాన గజదేవర కొండపై అకాల వర్షం కురవడంతో ఎత్తెయిన పర్వత శిఖరంపై కురిసిన పూలవర్షం వెల్లి విరిసింది. చూపరులను కనువిందు చేసింది. పర్వత శిఖరంపై కురిసిన పూల వర్షం, ప్రకృతి అందాలు, పారే జలపాతాలు పర్యాటకులను ఆకట్టుకుంది. ఆహ్లాదభరితంగా చూపరులను ఆకట్టుకుంది. కొంతమంది యువకులు ప్రకృతి అందాలను సెల్‌ఫోన్‌లో బంధించి అనుభూతి పొందారు.

గజదేవర కొండ నుంచి జాలువారుతున్న జలపాతాలు

## ఘనంగా ఉజ్జిడి బండి ఊరేగింపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 12 నుంచి గుమ్మలక్ష్మీపురం వేపారమ్మ గ్రామ దేవత ఉత్సవాల సందర్భంగా ముందస్తుగా గ్రామంలో ఆదివారం ఉజ్జిడి బండిని వీధి వీధిన ఊరేగించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షులు బొత్తాడా గౌరీశంకర్రావు, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్ కుమార్ తుడుము, డప్పు పట్టి దరువు వేసి సందడి చేశారు.

## సారా వల్ల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆదివారం గరుగుబిల్లి మండలం బురదవెంకటపురంలో నాటుసారాయి తాగడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ డి.పద్మావతి ఆధ్వర్యాన సిబ్బంది, గ్రామ పెద్దలు, యువజనులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నాటుసారాయి అమ్మకాలు నిర్మూలన ధ్యేయంగా రెవెన్యూ, పోలీసుల సహకారంతో నిరంతర నిఘా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. నాటుసారా అమ్మినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.